# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

epaper.manachourasta.com

సంపుటి : 01 | సంచిక : 28 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 25 డిసెంబర్ 2025 | పేజీలు : 04




## ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు

శాంతి, ప్రేమ, కరుణల సందేశాన్ని అందించిన ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటన ద్వారా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.







www.manachourasta.com



# రైతన్నలకి అండగా..

■ జిల్లాలో వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు ■ కలెక్టర్ పర్యవేక్షణలో సాగుతున్న యంత్రాంగం

**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ అంటే ఒక సవాల్, సమస్యలతో కూడుకున్న ప్రక్రియ, కానీ జనగామ జిల్లాలో ఈ ప్రక్రియ చాలా సాఫీగా, సజావుగా, వేగవంతంగా సాగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. ఎందుకంటె.. అధికారుల నిరంతర పర్యవేక్షణ, ఆధునిక సౌకర్యాల వినియోగం, వెను వెంటనే సమస్య ల పరిష్కారం, తేమ శాతం పరిశీలన, ఏరోజు వచ్చిన దాన్యాన్ని అదే రోజు తూకం వేయించడం, ట్యాబ్ ఎంట్రీ చేపించి.. డబ్బులు వెంటనే జమ చేయడం వంటివి చేయడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ఏ సీజన్ కు ఆ సీజన్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పక్కా కార్యాచరణ వల్ల జిల్లా లో ఇప్పటి వరకు జరిగిన కొనుగోళ్ళ వివరాలు... గత ఖరీఫ్ రికార్డ్ కంటే ప్రస్తుత ఖరీఫ్ 202526 సీజన్లో ఇప్పటివరకు 37,101 మంది రైతుల నుంచి 14,73,608 క్వింటాళ్ళ వరి ధాన్యం కొనుగోలు చేసి మొత్తం 329.74 కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇది గత ఖరీఫ్ 202425 సీజన్ కంటే ఎక్కువ అని... గత ఖరీఫ్ 202425 సీజన్లో మొత్తం 9,10,431 క్వింటాళ్ళ వరి ధాన్యం కొనుగోలు చేసి మొత్తం 211.21 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ ఖరీఫ్ 202526 సీజన్లో సన్న ధాన్యం అమ్మిన రైతులకు బోనస్ రూపేణా ఇప్పటికే 12.01 కోట్లు వారి అకౌంట్లలో జమ అయిందన్నారు. జిల్లాలో



ప్రోక్యుర్మెంట్ మొదలైనప్పటినుంచి నేటివరకు కొనుగోలు కేంద్రాలలో కొన్న ప్యాడి వెనువెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు పంపించి, సంబందిత కొనుగోలు వివరాలు ఏరోజుకారోజు ఆన్లైన్ లో నమోదు చేయడం ద్వారా ఏ జిల్లాలో లేనివిధంగా రైతులకు వేగంగా డబ్బు చెల్లించడంతో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా ప్రధమ స్థానంలో ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిరంతరం గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తూ ప్రతీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, సాఫీగా సాగేలా అధికారులు కృషి చేస్తున్నారు.

## బీజేపీలో చేరిన రంగయ్యపల్లి సర్పంచ్ రజని మహేష్

**భీమదేవరపల్లి,మన చౌరాస్తా :** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ రోజు కరీంనగర్లో కేంద్ర మంత్రి, పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ సమక్షంలో రంగయ్యపల్లి గ్రామ సర్పంచ్ మండల రజని మహేష్తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, రంగయ్యపల్లి గ్రామ అభివృద్ధికి అత్యధిక నిధులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో భీమదేవరపల్లి మండలంలో కాషాయ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ నాయకత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల కంటే ఎక్కువ నిధులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీలో చేరినవారిలో చేవెళ్ల ఆగయ్య, పెండ్యాల మొగిలి, బైకని కొంరయ్య, జిమ్మల మల్లారెడ్డి, మండల కనకయ్య, బిల్లవేన రవి, ఏనుగుల మల్లయ్య, కస్పోజు బిక్షపతి, బైకని సురేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, మ్యకల రాజు, సింగం రాజేందర్, జిమ్మల శ్రీనాథ్, సంజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.





## రసులాబాద్లో శ్రమదానం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం రసులాబాద్ గ్రామంలో బుధవారం రోజు నూతనంగా ఎన్నికైన పాలకవర్గం గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ ఆధ్వర్యంలో శ్రమ దాన కార్యక్రమం చేయడం జరిగింది. గ్రామంలోని గ్రామపంచాయతీ భవనం భవనం పైన చెత్తను మొత్తం శుభ్రం చేయడం జరిగింది. గ్రామ దేవత అయిన దుర్గమ్మ గుడి దగ్గర శ్రమదానం చేశారు. . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, బౌధూర్, మంజుల, లక్ష్మి, శ్రీకాంత్, పరశురాములు, శ్రీనివాస్, ఐలేని, భాను, స్వామి, మహిపాల్, నాగరాజ్, సంతోష్, అనిల్, నరేష్, కనకయ్య, అజయ్, గ్రామ సిబ్బంది రాజు, యాదయ్య, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.





## మంత్రి సీతక్కకు టీఎస్జేయూ వినతి

**ములుగు, మన చౌరాస్తా :** మంత్రి సీతక్కను తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలసి ఆక్రిడేషన్ కమిటీలలో తమ యూనియన్ కు ప్రాధాన్యత కల్పించాల్సిందిగా వినతి పత్రాన్ని అందజేశారు. మంత్రి సీతక్క స్పందిస్తూ యూనియన్ అభ్యర్థనను మంత్రి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## పేదల పెన్నిధి కాంగ్రెస్ : ప్రశాంత్ రెడ్డి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట లో జరిగిన పలు కార్యక్రమాలలో హాజరైన రాష్ట్ర యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, బచ్చన్నపేటలో మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి కనకయ్య కు సీఎంఆర్ చెక్కును అందించారు అనంతరం పట్టణ అధ్యక్షులు మహాత్మ చారి సోదరుడి ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తర్వాత కొన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త యాట కమలాకర్ మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మహమ్మద్ మసూద్, నల్లగొని బాలకిషన్, బండ నాగారం సర్పంచ్ ఇజ్జగిరి రాములు, మాజీ మార్కెట్ చైర్మన్ మాసాపేట రవీందర్ రెడ్డి, సిద్దులగుట్ట చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, గుర్రం బాలరాజ్, దిడిగ రమేష్, దతరపు నరేష్, శ్రీను, బాల్నే రాజేష్, వెంకట్ రెడ్డి, సిద్ధిరాములు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.





# కంపు కొడుతున్న ముల్కనూర్ బస్టాండ్

- **అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బస్టాండ్ ఏరియా ప్రస్తుతం ప్రజలకు ఊపిరి పీల్చుకోవడానికే వీలు లేని పరిస్థితికి చేరింది. రోజూ వందలాది మంది ప్రయాణించే బస్టాండ్ ప్రాంగణం మురుగు నీరు, చెత్తాచెదారం, భరించలేని దుర్వాసనతో నిండిపోయి అధికారుల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. బస్టాండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సెప్టిక్ ట్యాంకులు కాలం చెల్లిపోయి పూర్తిగా నిండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఈ లీకేజీలు బస్టాండ్ ప్రాంగణమంతా వ్యాపించి పరిసర ప్రాంతాన్ని నరకంగా మారుస్తున్నాయి. దుర్వాసన తట్టుకోలేక చిరు వ్యాపారులు తమ షాపులను మూసివేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. "రోజంతా ఇక్కడ నిలబడలేక వ్యాపారమే వదులుకోవాల్సి వస్తోంది" అని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో జాతీయ రహదారి పనుల పేరిట చేపట్టిన సైడ్ డ్రైనేజీ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఫలితంగా డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోయింది. ఆటో స్టాండ్ పరిసరాల్లో ప్రయాణికులు నిలబడేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత భయంకరంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంత తీవ్ర పరిస్థితి నెలకొన్నా బస్టాండ్ పర్యవేక్షణ బాధ్యత వహించాల్సిన అధికారులు కనీసం ఒకసారి కూడా పరిశీలన చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. "రోజూ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు?" అనే ప్రశ్న గ్రామస్తుల నుంచి వినిపిస్తోంది. చెత్తతో నిండిన సెప్టిక్ ట్యాంక్ ఏరియా అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజలు ప్రయాణించే బస్టాండ్ ఆరోగ్య హానికరంగా మారితే రేపు అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం లేకపోలేదని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి సెప్టిక్ ట్యాంకులను తక్షణమే శుభ్రపరచి, అర్ధాంతరంగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులను పూర్తిచేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ సభ్యుడిగా లక్ష్మీనారాయణ నాయక్




**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ, యాంటీ క్వాకరీ కమిటీ సభ్యుడిగా జనగామ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, అశోక్, స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీ దయాల్ సింగ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చిన సర్పంచ్

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని రాంపూర్ గ్రామంలో గత కొన్ని నెలల నుంచి మినరల్ వాటర్ ప్లాంట్ లోని పనిముట్లు చెడిపోవడంతో.. వాటిని బాగు చేయించకుండా అధికారులు మూసివేశారు. దీంతో ప్రజలు మినరల్ వాటర్ తాగడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత కొన్ని నెలల నుంచి వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడంతో రూ, లక్షల విలువైన యంత్రాలు సైతం దెబ్బ తినే ప్రమాదం ఉందని దానికి మరమ్మత్తులు చేయించాలని గ్రామస్తులు సర్పంచ్ శెట్టే కొమురయ్య దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన సర్పంచ్ కొమురయ్య తమ సొంత డబ్బులు రూ, 50 వేలతో మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామస్థుల దాహాన్ని తీర్చారు. గ్రామ ప్రజల కోసం సొంత నిధులతో వాటర్ ప్లాంట్ కు మరమ్మత్తులు చేపట్టడం హర్షనీయమని గ్రామస్తులు కొమురయ్యను అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.



### జాతీయ రోడ్డు భద్రతలో మార్గదర్శిగా

# తెలంగాణ నిలవాలి

### రవాణా శాఖ అధికారుల సమీక్షలో మంత్రి పొన్నం

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** జనవరి 1 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలబెట్టాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన జూమ్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించి మరణాల రేటును జీరోకి తగ్గించడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రాష్ట్రంలో నిత్యం సగటున 20 మంది వరకు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామం నుంచి రాజధాని వరకు అన్ని స్కూల్‌లు, కాలేజీల్లో రవాణా శాఖ అధికారులు స్వయంగా వెళ్లి విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృతంగా పాల్గొనాలి మాసోత్సవ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పాల్గొనేలా ఆర్టీఏ సభ్యులు ఆహ్వానించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు.

విస్తృత అవగాహన కార్యక్రమాలు విద్యార్థులు, లారీ డ్రైవర్లు, స్కూల్ బస్ డ్రైవర్లు, అంబులెన్స్ డ్రైవర్లు, డాక్టర్లు తప్పనిసరిగా భాగస్వాములవ్వాలని పేర్కొన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ పాఠశాలల విద్యార్థులు కూడా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. NSS, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్‌లను భాగస్వామ్యం చేసి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలతో సత్కరించాలని తెలిపారు.

#### జిల్లాల వారీగా కార్యాచరణ

ప్రతి జిల్లాలో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించి, కలెక్టర్ సమక్షంలో కార్యాచరణపై చర్చించాలని ఆదేశించారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతా ర్యాలీలు, వాక్ థాన్‌లు, హెల్మెట్, సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమాలు, రిపబ్లిక్ డే వేడుకల్లో రవాణా శాఖ శకటాల ప్రదర్శన, రంగోలి, క్విజ్, వ్యాసరచన పోటీలు కంటి పరీక్షలు, రక్తదాన శిబిరాలు, పాఠశాల బస్సుల భద్రతా తనిఖీలు, పాదచారుల భద్రత, ఓవర్‌లోడింగ్‌పై అవగాహన, విద్యార్థులకు వర్క్‌షాప్‌లు వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. చేసిన ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, విజువల్స్‌ను తప్పనిసరిగా రవాణా శాఖ కార్యాలయానికి పంపించాలని తెలిపారు. అలాగే జెటీసీలు, డిటీసీలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు రోజువారీ కార్యక్రమాల నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటీసీలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివలింగయ్య, డిటీసీలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు పాల్గొన్నారు.





# వైభవంగా గద్దెల ప్రతిష్టాపన

**మన చౌరాస్తా, ములుగు ప్రతినిధి :** ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా నూతన గద్దెలపైన పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన ఉత్సవం బుధవారం జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ లో భాగంగా కొనసాగిస్తున్న అభివృద్ధి పనుల అనంతరం తొలిసారి చేపట్టిన ఈ గద్దెల పై ప్రతిష్టాపనతో మేడారం కొత్త శోభను సంతరించుకున్నది. తమ ఇష్టదైవాలైన పగిడిద్దరాజు, గోవిందరాజుల వంశస్థులు ఆదివాసీ ముఖ్యంగా కోయ సంప్రదాయాల ప్రకారం ఈ తంతును నిర్వహించారు. పగిడిద్దరాజు వంశస్థులు కొత్తగూడ మండలం పూనుగొండ్ల నుంచి, గోవిందరాజుల వంశస్థులు ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి తమ వంశాచారం ప్రకారం గద్దెలపైకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ రాంనాథ్ కేకన్ లు పాల్గొన్నారు. బుధవారం ఉదయం నుంచే ఈ గద్దెలపైకి తమ ఇలవేల్పులను ప్రతిష్టించే.ఉత్సవం సాగింది. మేడారం లో సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు చేపట్టగా భక్తులకు దర్శన సౌకర్యార్థం ఒకే వరుసలో నూతనంగా ఆదివాసీ సాంప్రాయాల ప్రకారం పూజారుల సంస్కృతి పద్ధతిలో గద్దెల ప్రాంతంలో చేస్తున్న పునరుద్ధరణ పనులలో భాగంగా నూతన గద్దెల మీద బుదవారం ఉదయం ఆదివాసీ డోలు చప్పుళ్ళతో, సంప్రదాయ నృత్యాలతో అంగరంగ వైభవంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు.



## ప్రకృతి సిద్ధాంతమే ఆదివాసీ ఆచారం: సీతక్క

మేడారంలోనీ పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల తరలింపు ఆదివాసీ వడ్డెల (పూజారుల) అనుమతితోనే ప్రతిష్ఠాపన చేస్తున్నామని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. పూర్వికులు ఇచ్చిన ఆదేశాలతో పాటు పకృతి సిద్ధాంతాన్ని ఆచరించడమే ఆదివాసీ ఆచారమని స్పష్టం చేశారు. బుధవారం జరిగిన ఉత్సవం సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువు తరంగా మారుతుందని అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ మార్పు చేశామన్నారు. జాతరలో మొదటి ఘట్టం ప్రారంభమైందన్నారు. జాతరకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. పూర్వ కాలం నుంచి గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందన్నారు. శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్వం నుంచి గిరిజనులు ఎలాంటి వ్యాధుల బారిన పడినా పసుపును.వాడుతున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామన్నారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కల్యాణి, వడ్డెల (పూజారుల) సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, మేడారం సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న, ఆదివాసి పూజారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం మేడారంలో సామాన్య భక్తులకు దర్శనాలు బంద్ చేసినప్పటికీ సమాచారం తెలియని భక్తులు పెద్ద సంఖ్యలోనే హాజరయ్యారు.







# డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులివ్వాలి

- జీవో 252ను వెంటనే సవరించాలి
- మీడియా కార్డుల పేరుతో మోసం చేయొద్దు
- రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులని విడదీయడం సరికాదు
- డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం
- అధ్యక్ష, కార్యదర్శులుగా బాదిని ఉపేందర్, మస్తాన్ ఎన్నిక

**హైదరాబాద్, మన చౌరాస్తా :** వర్కింగ్ జర్నలిస్టుల మధ్య అధికారులు చిచ్చు పెట్టొద్దని, అక్రిడిటేషన్ల జారీలో వివక్ష చూపొద్దని డెస్క్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇస్తామనడం సరికాదన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో వివిధ పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ' (డీజేఎఫ్ టీ) పేరిట నూతన సంఘం ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్లో జీవో 252పై జర్నలిస్టులు చర్చించారు.

రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే వార్త అవుతుందని.. అట్లాంటప్పుడు ఈ విభజన ఎందుకని డీజేఎఫ్టీ నేతలు ప్రశ్నించారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే తీరును మానుకోవాలన్నారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను సెకండ్ గ్రేడ్ సిటిజన్లుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్న తమకు.. అక్రిడిటేషన్ ఇవ్వకపోవడం అంటే కష్టపడి సాధించుకున్న హక్కును గుంజుకోవడమేనని మండిపడ్డారు. కేవలం సంక్షేమ పథకాలు, ఇండ్ల స్థలాల కేటాయింపులో కోత పెట్టేందుకే ఈ స్క్రీనింగ్ చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. బస్ పాసుల విషయంలోనూ ఐఆర్ పీఆర్ ఆఫీసర్లు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హెచ్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్, టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి నవీన్ డబ్ల్యూఐజే రాష్ట్ర సెక్రటరీ రావికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని మద్దుతు ప్రకటించారు.

## కొత్త కార్యవర్గం ఇదే..

డీజేఎఫ్ టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కేవీ రాజారామ్, జాయింట్ సెక్రెటరీగా విజయ, ట్రెజరర్గా నిస్సార్ బాధ్యతలు స్వీకరించారు.

## డిమాండ్లు - తీర్మానాలు..

- డెస్క్ జర్నలిస్టులకు ఎప్పటిలాగే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి.
- వర్కింగ్ జర్నలిస్టులను వేరు చేసేలా ఉన్న జీవో 252 ను వెంటనే సవరించాలి.
- అక్రిడిటేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు చోటు కల్పించాలి. రాష్ట్రంలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ను, జిల్లాల్లో కలెక్టర్లను కలిసి మెమోరాండం ఇవ్వాలి.
- హైదరాబాద్తో పాటు అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేయాలి.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డెస్క్ జర్నలిస్టులందరినీ ఏకం చేసి, హక్కుల సాధన కోసం ఇతర సంఘాలతో కలిసి పోరాడాలి.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**